క్లుప్తంగా

సుడా జేపీఓగా శాస్త్రి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్‌గా సీహెచ్ శాస్త్రి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం మెట్రో పాలిటన్ రీజనల్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీ)లో జేపీఓగా పని చేస్తూ శ్రీకాకుళం బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఔట్ల ఏర్పాటుకు తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు.

పీటీఎం ఏర్పాట్ల పరిశీలన



శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరగనున్న పేరెంట్స్ టీచర్స్ మీటింగ్(పీటీఎం)కు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శుక్రవారం పరిశీలించారు. ప్రొగ్రెస్ కార్డులు, హెల్త్‌కార్డులను పరిశీలించారు. కార్యక్రమ నిర్వహణ తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సమావేశం పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.వాగ్దేవి, ఉపాధ్యాయురాలు వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా..



నిరుపేదలకు వస్త్రాలు, పండ్లు పంపిణీ చేస్తున్న నటుకుల మోహన్

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగర పాలక సంస్థ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) నిధులతో నిర్వహిస్తున్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో నిరుపేదలకు లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్ శుక్రవారం అన్నదానం, వస్త్రదానం చేశారు. లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు ఉర్లం శివతేజ, జోగి రాజు, సేవకులు బొట్టా సాయి, సిక్కోలు స్వచ్ఛంద సేవ సమితి పొడుగు చరణ్, పొడుగు అవినాష్ పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదానం చేస్తున్న బ్యాంక్ సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: రక్తదానం మహాదానమని డాక్టర్ మూల వెంకటరావు అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్‌లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కార్యాలయం వద్ద ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో 16వ అఖిల భారత రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. బ్యాంకు సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఏ.శేఖర్, యూనిట్ హెడ్ జి.వి.శశిధర్ (డబ్ల్యుబీఓ), మేనేజర్ బరాటం రవిశంకర్, రెడ్ క్రాస్ ప్రతినిధి పెంకి చైతన్య, బ్రాంచ్ సభ్యులు సీహెచ్ అనుదీప్, ఎస్.ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ముద్దాడలో ఉపాధ్యాయులను కలిసిన రఘువర్మ

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేయనున్న పాకలపాటి రఘువర్మ శుక్రవారం పొన్నాడ, అల్లినగరం, ముద్దాడ, బొంతలకోడూరు గ్రామాల్లో ఉపాధ్యాయులను కలిశారు. మరోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు.

వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

జి.సిగడాం: మండలంలోని విజయరాంపురం సమీపంలో సెప్టిక్ ట్యాంక్ వాహనం ఢీకొని సీతారాంపురం గ్రామానికి చెందిన పలిశెట్టి శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డాడు. చెట్టు వద్ద నిల్చుని ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. తీవ్ర గాయాలు కావడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. రాజాంకు చెందిన సజ్జల రామాంజనేయులు మద్యం తాగి వాహనం డ్రైవ్ చేయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గ్రామస్తులు, బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

నెలవారీ విభాగం

రజతోత్సవ సంబరం



నాటక పరిషత్తులో ప్రదర్శన (ఫైల్)

- కళారంగానికి విశేష కృషి చేస్తున్న రంగస్థల కళాకారుల సమాఖ్య
- నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో 301 నెలలుగా ప్రదర్శనలు
- నేటి నుంచి రజతోత్సవ వేడుకలు
- మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రదర్శనలు



రజతోత్సవ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్ : ప్రస్తుత ఓటీటీ యుగంలో రంగస్థల ప్రదర్శనలకు ఆదరణ కరువవుతోంది. కళాకారులకు సరైన ప్రోత్సాహం లేక అనేక ప్రాచీన, సాంస్కృతిక కళలు కనుమరుగైపోతున్నాయి. ఈ నేపథ్యంలో కళాకారులను ప్రోత్సహించేందుకు, కళల పరిరక్షణకు శ్రీకాకుళంలోని రంగస్థల కళాకారుల సమాఖ్య నడుంబిగించింది. నెలవారీ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ప్రతి నెలా పౌరాణిక, సాంఘిక, నాటక ప్రదర్శనలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, జానపద కళారూపాల ప్రదర్శనలు నిర్వహిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తోంది. జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి కూడా కళాకారులను రప్పించి వారితో ప్రదర్శనలు ఇప్పించి వెన్నుదన్నుగా నిలుస్తోంది. కళాభిమానుల సాయంతో నాటక రంగాన్ని బతికిస్తోంది. 1999 ఆగస్టులో ఏర్పాటైన ఈ నెలవారీ సాంస్కృతిక విభాగం 301 నెలల పాటు నిరాటంకంగా ప్రదర్శనలు నిర్వహించింది. నేడు రజతోత్సవం జరుపుకుంటోంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్ వేదికగా మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రదర్శనలకు సిద్ధమైంది.

కళాకారులకు పింఛన్లు..

నాటరంగానికి, కళారంగానికి ఎనలేని సేవలుచేసి జీవిత చరమాంకంలో పోషణ లేక కష్టంలో ఉన్న పేద, వృద్ధ కళాకారులకు నెలవారీ సాంస్కృతి విభాగం పింఛన్ రూపంలో సహకారం అందిస్తోంది. ఇందుకోసం ఎంతోమంది కళాభిమానులు సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రస్తుతం 30మంది పేద, వృద్ధ కళాకారులకు రూ.400 చొప్పున పింఛన్ అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వెయ్యిమంది కళకరులకు గుర్తింపు కార్డులు ఇచ్చారు. వీరిచ్చిన గుర్తింపుకార్డులతోనే ప్రభుత్వ పింఛన్ పొందుతున్నారు. పండగ సందర్భంగా పేద కళాకారులకు వస్త్రాలు, పెళ్లిళ్లకు తమ వంతు సాయం అందిస్తున్నారు.

నేటి నుంచి వేడుకలు..

- 302వ నెల సందర్భంగా డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 7న ఎన్జీఓ హోమ్ నుంచి జానపద కళారూపాలతో ఊరేగింపు ప్రారంభమవుతుంది. అనంతరం బాపూజీ కళామందిర్‌లో జానపద కళారూపాల ప్రదర్శనలు జరుగుతాయి. రజనీరాజా కళాక్షేత్రం(పార్వతీపురం) నృత్య ప్రదర్శనలు, ప్రముఖ మెజీషియన్ బెతా శ్రీనివాసరాజుచే ఇంద్రజాల ప్రదర్శన, జముకుల పాట, శ్రీకాంత్ ఆధ్వర్యంలో నృత్య ప్రదర్శనలు ఉంటాయి. అనంతరం మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్(చిలకలూరిపేట) 'మా ఇంట్లో మహాభారతం' నాటిక ప్రదర్శన జరుగుతుంది.
- 8న సాయంత్రం సంప్రదాయం డైరెక్టర్ స్వాతి సోమనాథ శిష్యబృందంచే ద్రౌపది నృత్య రూపకం, శ్రీనివాస్ గజల్ గానం, అభినయ ఆర్ట్స్, గుంటూరు 'ఇది అతని సంతకం' నాటిక ప్రదర్శన ఉంటుంది.
- 9న సనపల ధనుంజయ బృందం అల్లూరి సీతారామరాజు బుర్రకథ, లోకనాథం నందికేశ్వరరావు మిమిక్రీ ప్రదర్శన, పేద కళాకారులకు నూతన వస్త్ర దానం, బాలభారతి నాటక కళాసమితి(రాజాం) 'సత్యహరిశ్చంద్ర(అరణ్య సీను) పౌరాణిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.

కళను బతికించడానికే..



అంతరించి పోతున్న కళలను బతికించడానికి అందరి సహకారంతో మావంతు కృషి చేస్తున్నాం. ఇన్ని నెలలూ కార్యక్రమాలు చేయడానికి మా కళాకారులే కాకుండా దాతలు కూడా ముందుకు వస్తున్నారు.

– చిట్టి వెంకటరావు, అధ్యక్షుడు, నెలవారీ సాంస్కృతిక విభాగం

ప్రతి ఏడాది నాటక పరిషత్తులు..



ప్రతి ఏడాది నాటకపరిషత్తులు నిర్వహిస్తున్నాం. ప్రదర్శనల ద్వారా నాటక రంగానికి మా వంతు కృషి చేస్తున్నాం. రాష్ట్రస్థాయి నాటికల నిర్వహణకు ఆయా జిల్లాలకు వెళ్లి ఎంపికలు చేస్తున్నాం.

– బి.రామచంద్రదేవ్, కార్యదర్శి

25 ఏళ్ల కృషి..



అంతరించిపోతున్న కళలను కాపాడుకోవడానికి 25 ఏళ్లుగా కృషి చేస్తునే ఉన్నాం. మా ఊపిరి ఉన్నంత వరకు చేస్తునే ఉంటాం. కళాకారులను ప్రోత్సహించేందుకు అందరూ ముందుకు రావాలి.

– ఎల్.రామలింగస్వామి, గౌరవ అధ్యక్షుడు

కళాకారులకు చేయూత



తోటి కళాకారులను ఆదుకోవడానికి నెలవారీ సాంస్కృతిక విభాగం కృషి చేస్తోంది. మాకు చేతనైన సాయాన్ని ప్రతి లా పింఛను రూపంలో అందిస్తున్నాం. కళలకు తోడ్పాటునందించాలి.

– పన్నాల నర్సింహమూర్తి, కార్యనిర్వాహక అధ్యక్షుడు

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి



శ్రీకాకుళం క్రైమ్ : అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రణస్థలం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా రణస్థలంలో ఆయన విగ్రహానికి కిరణ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ పూలమాల వేసి నివాళి అర్పించారు.



రణస్థలం: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

కార్యక్రమంలో జెడ్పీటీసీ టొంపల సీతారాం, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, దళిత మహాసభ సంఘ నాయకులు దేబారిక రాము, డి.కుసుమ, డి.ప్రసాద్, కె.రాము, కుప్పిలి అప్పారావు, కె.రాజయ్య, కె.కుమార్, శివ పాల్గొన్నారు.

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంబేడ్కర్‌ను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు కిలారి ఈశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు అన్నారు. శ్రీకాకుళం బార్ అసోసియేషన్ హాలులో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు.



రణస్థలం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు



రణస్థలం: ఎంపీడీవో కార్యాలయం వద్ద అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న సాయికుమార్



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు



శ్రీకాకుళం రూరల్: రాగోలులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ నేత యజ్జల గురుమూర్తి



శ్రీకాకుళం రూరల్: ఆదివారంపేటలో విద్యార్థుల సమక్షంలో అంబేడ్కర్ వర్ధంతి



గార: ఆరంగిపేటలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్:తమ్మినాయుడుపేటలో అంబేడ్కర్ వర్ధంతి



శ్రీకాకుళం అర్బన్: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎచ్చెర్ల క్యాంపస్:ఎచ్చెర్లలో అంబేడ్కర్ వర్ధంతి

శబరిమలకు విమాన సౌకర్యంపై హర్షం

శ్రీకాకుళం అర్బన్: అయ్యప్పస్వాములు శబరిమలకు విమానంలో వెళ్లేందుకు అనుమతినిస్తూ కేంద్ర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని జిల్లా ఎయిర్ ట్రావెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నటుకుల మోహన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

8 నుంచి భగవద్గీత సప్తాహం

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని ఉపనిషన్మందిరంలో ఈ నెల 8 నుంచి 14 వరకు భగవద్గీత సప్తాహం నిర్వహిస్తున్నట్లు మందిర ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 8న భగవద్గీత – భారతగీత, 9న గీత – పారస్మృతి, 10న మాఫలేషు కదాచన, 11న సమస్యలకు పరిష్కారం –భగవద్గీత, 12న గీత – శరణాగత తత్పరత, 13న జ్ఞాన విజ్ఞాన యోగం, 14న ఊర్థ్వ మూలమధశ్శాఖమ్ అంశాలపై ప్రవచనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

నేడు మహిళా కళాశాలలో పూర్వ విద్యార్థుల కలయిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాలలో శనివారం పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యచంద్రరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థినులంతా హాజరుకావాలని కోరారు. కెపాసిటీ బిల్డింగ్ ఫర్ ఉమెన్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల : మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ అమ్మవారికి అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీజీఎం ప్రసాద్, బ్యాంకు అధికారులు

శ్రీకాకుళం అర్బన్: కెనరా బ్యాంక్ ద్వారా అందించే రుణాలు, రాయితీలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ డీజీఎం ఎ.పి.ప్రసాద్ కోరారు. శ్రీకాకుళంలోని రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ, ముద్ర రుణాలపై ఖాతాదారులు, ప్రజలతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రీజనల్ మేనేజర్ వినోద్ మాట్లాడుతూ పీఎంఈజీపీ రుణాలు, బంగారు రుణాలను త్వరితగతిన మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, జిల్లా వయోజన విద్యాధికారి వెంకటరమణ, కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ సింగ్, సూర్యప్రకాష్, రాజ్యలక్ష్మి, బ్రాంచి మేనేజర్లు పాల్గొన్నారు.

సంతోషిమాతకు విశేష పూజలు



పాత శ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ నేతృత్వంలో మూలవిరాట్టుకు నమక చమక సహిత పంచ సూక్తములతో అభిషేకాలు నిర్వహించి అమ్మవారికి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేశారు. అనంతరం సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు. – శ్రీకాకుళం కల్చరల్

ఉత్తమ ఫలితాలే లక్ష్యం



పది, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు. ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గురువారం జి.సిగడాం మోడల్ స్కూల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యేల్ లెంక ఆధ్వర్యంలో ఇలా విద్యార్థులకు ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. – జి.సిగడాం

ముగ్గుల ముచ్చట



తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి పాఠశాలలు ముస్తాబయ్యాయి. శనివారం జరిగే సమావేశానికి జి.సిగడాం మండలం పెంట ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మజ్జి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పాఠశాల ఆవరణను రంగవల్లికలతో తీర్చిదిద్దారు. – జి.సిగడాం

సాగు హక్కు కల్పించండి



వాండ్రంగి సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేంద్రప్రసాద్‌బాబు



మహంతిపాలెంలో సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

జి.సిగడాం: వందేళ్లగా సాగు చేస్తున్న దేవదాయ భూములపై సాగు హక్కు కల్పించాలని వాండ్రంగి గ్రామానికి చెందిన రైతులు బూరాడ వెంకటరమణ, డబ్బాడ రామారావు, తవుడు, ఆదినారాయణ, బొట్ల భాస్కరరావు తదితర రైతులు కోరారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సాకేటి నాగరాజు, మండల ప్రత్యేకాఅధికారి రాజేంద్రప్రసాద్ బాబు, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్, డీటీ కొత్తపల్లి గాయిత్రి, ఆర్ఐ రాధ, సర్వేయర్ శాంతారావు, మొయ్యి ఈశ్వరరావు, వీఆర్ఓ శివనారాయణ పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని మహంతిపాలెం, గోసాం రెవెన్యూ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కొవ్వాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.వి.లక్ష్మణమూర్తి, తహసీల్దార్ ఎస్.ప్రసాద్, సబ్ రిజిస్ట్రార్ తులసీదాస్, మండల సర్వేయర్ ఎస్.రవి, రీసర్వే డీటీ తార శ్రీదేవి, ఆర్ఐ సతీష్, సర్పంచ్‌లు గొర్లె అప్పలనాయుడు, కంబపు రామిరెడ్డి పాల్గొన్నారు.



తోణంగిలో రైతు నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో సాయిప్రత్యూష

గార: తోనంగి సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిప్రత్యూష, తహశీల్దార్ ఎస్.రమణారావు, ఆర్ఐ డి.సంజయ్, వీఆర్వో సుశీల, మండల సర్వేయర్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నాం



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

జి.సిగడాం: ఓవైపు పనిఒత్తిడి, మరోవైపు నాయకుల వేధింపులు భరించలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు తులసీ ప్రసాద్ సాహు, ఏర్నేన జ్యోతిశ్రీనివాస్, జాడ వెంకటనాయుడు, పాట్నూరు సురేష్‌కుమార్, వడగా గౌరీశంకరరావు, ఎదూరి హరిబాబు, రాజశేఖరం, కిమిడి హైమావతి, సుందరమ్మ, హిమబిందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ జి.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. సచివాలయాల్లో వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది ఉన్నారని, వారి పని కూడా పంచాయతీ కార్యదర్శులకు చేయమనడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు రాజా రమేష్, గౌరీశ్వరి, ఉషారాణి, భారతి, సురేష్‌కుమార్, సతీష్, హైదేహి తదితరులు పాల్గొన్నారు.